# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

శనివారం 20, డిసెంబర్ 2025


### అక్రమంగా నిల్వఉంచిన

# కలప పట్టివేత

ఆసిఫాబాద్, డిసెంబర్ 19, ప్రభాతవార్త



ఆసిఫాబాద్ మండలం ధడ్వాపూర్ సమీపంలోని పంట చేనులలో అక్రమంగా నిలువ ఉంచిన కలపను అటవీ అధికారులు పట్టుకున్నారు. ఆసిఫాబాద్ రేంజ్ అధికారి గోవింద్ చంద్ సర్దార్ తెలిపిన వివరాల ప్రకారం జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్ కుమార్ సమాచారంతో డిప్యూటీ రేంజ్ అధికారి యోగేష్ కులకర్ణి ఆధ్వర్యంలో దడ్వాపూర్ గ్రామ సమీపంలో రెండు రోజుల క్రితం రాత్రి పూట సిబ్బంది పెట్రోలింగ్ నిర్వహించి నిల్వ ఉంచిన కలపను స్వాధీనం చేసుకొని రేంజ్ కార్యాలయానికి తరలించారు. కలప అక్రమంగా నిల్వ ఉంచిన వారిని గుర్తించి గ్రామానికి చెందిన తిరుపతి, హనుమంతు, రాజేశంలను అదుపులోకి తీసుకొని విచారించి గురువారం రాత్రి స్థానిక సబ్ జైలుకు తరలించినట్లు తెలిపారు. స్వాధీనం

మిగతా 2లో..

### ప్రజల క్షేమమే

# కాంగ్రెస్ లక్ష్యం

✣ డిసిసి అధ్యక్షురాలు సుగుణక్క



కెరమెరి, డిసెంబర్ 19, ప్రభాతవార్త

ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని డిసిసి అధ్యక్షురాలు సుగుణక్క అన్నారు శుక్రవారం జైనూరు మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు సుగుణ అక్క ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఇటీవలే వార్డ్ సభ్యులుగా గెలుపొందిన షేక్ షఫిక్ అన్సారీ, బుతాలే కిరణ్, షేక్ తజోద్దీన్, అబుజార్, సోహెల్, పార్టీ లో చేరారు. వారందరికీ పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం పార్టీ వారికి శాలువాలతో

మిగతా 2లో..

### ప్రకృతి విపత్తుల సమయంలో

# తక్షణమే స్పందించేలా సిద్ధంగా ఉండాలి

✣ జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ అధికారి సుధీర్ బాల్

నస్పూర్, డిసెంబర్ 19, ప్రభాతవార్త






ప్రకృతి విపత్తుల సమయంలో తక్షణమే స్పందించి ప్రజారక్షణ చర్యలు చేపట్టేందుకు పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ అధికారి సుధీర్ బాల్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, నీటిపారుదల, పశుసంవర్ధక, పోలీస్, వ్యవసాయ, అగ్నిమాపక, రహదారులు, పంచాయతీరాజ్, విద్యుత్, వైద్య ఆరోగ్య ఇతర అధికారులతో రక్షణ చర్యల ప్రణాళిక రూపకల్పన పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ అధికారి మాట్లాడుతూ జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ, రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ సంయుక్తంగా అన్ని శాఖల సమన్వయంతో పరిశ్రమలలో అగ్ని ప్రమాదాల నివారణ, ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజా రక్షణ పై చర్యలు తీసుకోవాలని తెలిపారు. భారీ వర్షాల సమయంలో వరదలు సంభవించినప్పుడు జాతీయ, రాష్ట్ర ప్రకృతి విపత్తుల నిర్వహణ సంస్థల సమన్వయంతో వరద ప్రభావిత ప్రాంతాలలో ఆర్మీ సిబ్బంది వినియోగంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ప్రమాద సమయంలో ప్రజలకు చేయవలసిన ప్రమాద హెచ్చరికలు, ప్రజా అవగాహన కొరకు చేపట్టవలసిన చర్యలు తెలుసుకోవాలని, అన్ని శాఖల సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు. కాప్(దితిశి) వ్యవస్థ, అత్యవసర మిగతా 2లో..

# విద్యార్థులు కంప్యూటర్లను సద్వినియోగం చేసుకోవాలి

✦ ఉట్నూర్ సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్

ఉట్నూర్, ప్రభాతవార్త:



ఉట్నూర్ పరిధిలోని ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులకు అందించిన కంప్యూటర్లను సద్వినియోగం చేసుకొని విద్యలో మరింత రాణించాలని ఉట్నూర్ సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్ అన్నారు. శుక్రవారం గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పాఠశాల విద్యార్థినులకు ఉచిత కంప్యూటర్ల పంపిణీ కార్యక్రమానికి గ్లోబల్ ఫౌండేషన్ రాష్ట్ర సమన్వయకర్త ఎండి. సాబీర్ హుస్సేన్, ఐటిడిఏ ఉపసంచాలకులు అంబాజీ యాదవ్‌లతో కలిసి హాజరై విద్యార్థులకు ఉచిత కంప్యూటర్లను అందజేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ గ్లోబల్ ఫౌండేషన్ సంస్థ అధినేత ఎండి. బాబర్ విద్యార్థులకు ఉచితంగా కంప్యూటర్లు అందించడం అభినందనీయమని తెలిపారు. విద్యార్థులు ఈ కంప్యూటర్లను సద్వినియోగం చేసుకుని సబ్జెక్టులపై మరింత అవగాహన పెంచుకోవాలని, వార్షిక ఫలితాలలో ఉత్తమ ఫలితాలు సాధించాలని తెలిపారు. ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తుందని, అన్ని ప్రభుత్వ పాఠశాలలో సకల సదుపాయాలు కల్పించి నాణ్యమైన మిగతా 2లో..

### పాఠశాలల్లో టాయిలెట్స్

# నిర్వహణ మెరుగుపడాలి

✣ జిల్లా విద్యాశాఖ ప్లానింగ్ కోఆర్డినేటర్ భరత్ కుమార్

వేమనపల్లి, డిసెంబర్ 19, ప్రభాతవార్త



పాఠశాలల్లో టాయిలెట్స్ నిర్వహణ బాగుపడాలని జిల్లా విద్యాశాఖ ప్లానింగ్ కోఆర్డినేటర్ భరత్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, కొత్తపల్లి పాఠశాల, కేజీబీవి పాఠశాలను జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. వేమనపల్లి పాఠశాలలోని టాయిలెట్స్ నిర్వహణ సరిగ్గా లేదని పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు, పారిశుధ్య మిగతా 2లో..

## అక్రమంగా నిల్వఉంచిన కలప పట్టివేత

(మొదటిపేజీ తరువాయి)

చేసుకున్న కలప విలువ 52,132 లుగా ఉందని తెలిపారు. అక్రమంగా కలప రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, అటవీ సంరక్షణతో పాటు జంతువుల సంరక్షణ కూడా ప్రజలు బాధ్యతగా తీసుకోవాలని అప్పుడే వాటి సంరక్షణ సాధ్యమవుతుందన్నారు. ఎక్కడైనా అక్రమ కలప రవాణా చేస్తే సమాచారం అందించాలని సూచించారు. ఈ దాడిలో సెక్షన్ అధికారులు మహేందర్, బీట్ అధికారులు కిషోర్, ప్రభాకర్, రాజేష్ లు పాల్గొన్నారు.

### 24న వేంపల్లి టింబర్ డిపోలోని కలప అమ్మకం..

జిల్లా అటవీ శాఖ అధికారి నీరజ్ కుమార్ టిబ్రేవాల్‌జిల్లాలోని కాగజ్నగర్ పరిధిలోని వేంపల్లి టింబర్ డిపోలో ఈనెల 24వ తేదీన ఉదయం 11 గంటలకు కలప అమ్మక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా అటవీ శాఖ అధికారి నీరజ్కుమార్ టిబ్రేవాల్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అటవీశాఖ నిబంధనల ప్రకారం ఈ అమ్మకం పూర్తిగా పారదర్శకంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల కలప వ్యాపారులు, వినియోగదారులు ఈ అమ్మకంలో పాల్గొనవచ్చని, పాల్గొనే వారు ముందుగా నిర్ణయించిన షరతులు, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. కలప రకాలు, పరిమాణం, వేలం విధానం, రిజిస్ట్రేషన్ వివరాల కోసం ఆసక్తి గల వారు వేంపల్లి టింబర్ డిపో కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. అటవీ సంపదను సుస్థిరంగా వినియోగించడమే లక్ష్యంగా 23వ తేదీన కలప అమ్మకాన్ని నిర్వహిస్తున్నామని, కార్యక్రమానికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు.

## విద్యార్థులు కంప్యూటర్లను సద్వినియోగం చేసుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)

విద్య అందించడంతోపాటు విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందిస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యను అభ్యసించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏ సి ఎం ఓ జగన్, ఏ టి డి ఓ సదానందం, ఉట్నూర్ మండల విద్యాధికారి ఆశన్న, పాఠశాల ప్రిన్సిపల్ మాణిక్ రావు,గ్లోబల్ ఫౌండేషన్ సంస్థ ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో టాయిలెట్స్ నిర్వహణ మెరుగుపడాలి

(మొదటిపేజీ తరువాయి)

నిర్వాహకురాలిపై అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలల్లో పారిశుద్ధ్య నిర్వహణ కొరకు, టాయిలెట్స్, పాఠశాలల పరిసరాల మెరుగైన నిర్వహణ కొరకు జిల్లా కలెక్టర్ డిఎంఎఫ్టి నిధుల నుండి స్కూల్ ఫెసిలిటీ అండ్ మెంటెనెన్స్ గ్రాంటును ప్రతినెల మంజూరు చేస్తున్నారని, కలెక్టర్ ఆకాంక్షల మేరకు ప్రతి పాఠశాలల్లో ఉదయం పూట ఒకసారి మధ్యాహ్నం పూట రెండవసారి ప్రతిరోజు టాయిలెట్స్‌ను శుభ్రం చేయించి దుర్వాసన రాకుండా చూడాలని, రెండుసార్లు శుభ్రం చేసి రిజిస్టర్లో నమోదు చేయించి ప్రధానోపాధ్యాయులు సంతకం చేయాలని తెలిపారు. ఉపాధ్యాయుల ఫేస్ రికగ్నిషన్ టైమ్ అటెండెన్స్ సిస్టమ్ హాజరు నమోదును ఎంఎస్ సి రాజ్ కుమార్ పరిశీలించారు. ఎఫ్ఎల్ఎన్ పరీక్ష సన్నద్ధతపైన జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ సత్యనారాయణ మూర్తి ఉపాధ్యాయులకు మార్గ నిర్దేశం చేశారు. చైల్డ్ సేఫ్టీపైన జెండర్ అండ్ ఈక్విటీ జిల్లా కోఆర్డినేటర్ విజయలక్ష్మి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. కొత్తపల్లి పాఠశాలలో 23 మంది విద్యార్థులలో 100 విద్యార్థులు హాజరవడం, వారందరూ ఫేస్ రికగ్నిషన్ టైమ్ అటెండెన్స్ సిస్టమ్ హాజరులో నమోదవడంతో ఉపాధ్యాయులు శ్రీధర్, మణి లను అభినందించారు. కొత్తపల్లి పాఠశాలకి ఇటీవల బలుర బాలికలకు టాయిలెట్స్ ని కలెక్టర్ మంజూరు చేశారని సంబంధిత పంచాయతీరాజ్ ఇంజనీర్ సహకారంతో త్వరలో పనులు ప్రారంభం అయ్యేలా చూస్తానని మండల విద్యాధికారి శ్రీధర్ రెడ్డి తెలిపారు. వీరితో కేజీబీవి ఎస్ఓ మయూరి ఉపాధ్యాయులు ఉన్నారు.

## భవిష్యత్తుపై నమ్మకంతో ముందుకు సాగాలి: మాజీ ఎమ్మెల్యే

పెంచికల్ పేట్, డిసెంబర్ 19, ప్రభాతవార్త:



పెంచికల్‌పేట్ మండలంలో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పర్యటించారు. ఈ సందర్భంగా ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసి ఓటమిపాలైన సర్పంచ్ అభ్యర్థులతో ఆయన ప్రత్యేకంగా ముచ్చటించారు. పెంచికల్ పేట్ సర్పంచ్ అభ్యర్థి చిందాం మోనిక, ఎల్లూర్ సర్పంచ్ అభ్యర్థి సయ్యద్ సాజీత్, ఎల్కపల్లి సర్పంచ్ అభ్యర్థి కాశిపాక రాకేష్ లతో మాట్లాడిన కోనేరు కోనప్ప ఓటమితో కుంగిపోవాల్సిన అవసరం లేదని వారికి సూచించారు. రాజకీయాల్లో గెలుపు ఓటములు సహజమని భవిష్యత్తుపై భరోసాతో, దృఢ సంకల్పంతో ప్రజల మధ్య ఉండి సేవ చేయాలని ప్రోత్సహించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తను ఎల్లప్పుడూ అండగా ఉంటానని, మండల అభివృద్ధి కోసం అవసరమైన సహకారం అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం గత వారం రోజుల క్రితం ప్రమాదంలో గాయపడిన పెంచికల్ పేట్ గ్రామానికి చెందిన రౌతు గణపతిని వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రకృతి విపత్తుల సమయంలో తక్షణమే స్పందించేలా సిద్ధంగా ఉండాలి

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహణ కేంద్రాలపై అధికారులు అవగాహన కలిగి ఉండాలని, విపత్తుల సమయంలో వినియోగించుకుని చేపట్టవలసిన ప్రజా రక్షణ చర్యలను అమలు చేయాలని తెలిపారు. వర్షాల సమయంలో వరద ప్రభావిత ప్రాంతాలలో ప్రజలకు ముందుగా హెచ్చరికలు జారీచేసి సురక్షిత ప్రాంతాలకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సెంట్రల్ వాటర్ కమిషన్, నేషనల్ డేటా బేస్ ఫర్ ఎమర్జెన్సీ మేనేజ్మెంట్ ద్వారా వివరాలు తీసుకొని రక్షణ చర్యల దిశగా ప్రణాళిక రూపొందించుకోవాలని తెలిపారు. జిల్లా కలెక్టర్లు వారి పరిధిలోని విపత్తు ప్రభావిత ప్రాంతాలను తక్షణమే గుర్తించాలని, క్రమబద్ధమైన నిర్వహణ ప్రక్రియ కలిగి ఉండాలని తెలిపారు. పునరావాస కేంద్రాలలో కనీసం 10 రోజులు ప్రజలకు అవసరమైన ఏర్పాట్లు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సంబంధిత శాఖలు తమ పరిధిలో చేపట్టవలసిన రక్షణ చర్యలపై పూర్తి అవగాహన కలిగి ఉండి విపత్తు సమయంలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ నెల 22వ తేదీన అన్ని జిల్లాలలో మాక్ డ్రిల్ నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలోని చెన్నూర్ మండల తహసిల్దార్ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజల రక్షణ దిశగా సంబంధిత శాఖల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. లోతట్టు ప్రాంతాలు, వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తూ పునరావాస కేంద్రాలకు తరలించి వారికి అవసరమైన ఆహారం, వైద్య సదుపాయాలు కల్పిస్తున్నామని, కేంద్ర, రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థల సమన్వయంతో ప్రజల రక్షణ దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల క్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సుగుణ అక్క మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తోందని, గ్రామ స్థాయి నుంచి ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉందని తెలిపారు. ప్రజల నమ్మకంతో ఎన్నికైన ప్రజాప్రతినిధులు పార్టీని మరింత బలోపేతం చేయాలని, గ్రామ అభివృద్ధికి కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు షేక్ ముఖీద్ అహేమద్, మండల నాయకులు అజ్జు లాల, ప్రకాష్, పవర్ గూడా సర్పంచ్ రాజేందర్, దౌలత్, గులాబ్ సాబ్, రమేష్, భుజంగ్ రావు, షేక్ రహీం, షేక్ మాజార్ తదితరులు పాల్గొన్నారు.

## రాజంపేట సర్పంచ్‌కు సన్మానం

కెరమెరి, ప్రభాతవార్త



సన్మానిస్తున్న పెందూర్ ఆనంద్‌రావు

ఆసిఫాబాద్ మండలంలోని రాజంపేట గ్రామ పంచాయతీకి నూతనంగా గెలుపొందిన బుర్స పోచయ్యకు శుక్రవారం సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కెరమెరి సర్పంచ్ పెందూర్ ఆనంద్‌రావు,మాజీ ఉప సర్పంచ్ నిసార్ దేశ్‌ముక్‌లు పాల్గొని సర్పంచ్ బుర్స పోచయ్యను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన ఆసిఫాబాద్ రాజంపేట గ్రామ పంచాయతీకి మొట్ట మొదటి సర్పంచ్ ఎన్నిక కావడం సంతోషకరమని అన్నారు. వారి వెంట గైక్వాడ్ రాంచందర్, కారోబార్ గడ్డల వెంకన్న ఉన్నారు.

## ఈస్గాం శివాలయం హుండీ ఆదాయం రూ. 3.42 లక్షలు

కాగజ్‌నగర్ రూరల్, డిసెంబర్ 19, ప్రభాతవార్త :

కాగజ్‌నగర్ మండలంలో ఈస్గాం శివమల్లన్న స్వామి ఆలయ హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను శుక్రవారం దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆదిలాబాద్ డివిజన్ పర్యవేక్షకులు రంగు కిషన్ పర్యవేక్షణలో లెక్కించారు. సుమారు గత 9 నెలల 18 రోజులకు గాను భక్తులు హుండీలలో సమర్పించిన కానుకలు లెక్కించగా రూ. 3,42,915 నగదు ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి వేణుగోపాల్ గుప్తా తెలిపారు. లెక్కింపు కార్యక్రమంలో దేవాలయ ఉత్సవ కమిటీ చైర్మన్ మైలారపు మురళీధర్, సభ్యులు రామ్ టెక్ సత్తయ్య, ఆసిఫాబాద్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శి కంభంపాటి సంతోష్, దేవాలయ కార్యనిర్వాహణాధికారి గర్రెపల్లి వేణుగోపాల్ గుప్తా, దేవాలయ అర్చకులు ఇందారపు సంతోష్, వేద పండితులు ముద్దు నరహరి శర్మ, దేవాలయ సిబ్బంది పాల్గొన్నారు. వాసవి సేవాదళ్, వాసవి మహిళా మండలి కాగజ్నగర్ సభ్యులు, శివ మల్లన్న సేవా సమితి ఇస్గాం సభ్యులు, అరుణోదయ విద్యాలయం కాగజ్నగర్ విద్యార్థినీ విద్యార్థులు లెక్కింపు కార్యక్రమంలో సేవలను అందించారు. హుండీల లెక్కింపు కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఈస్గాం పోలీస్ స్టేషన్ ఎస్సై కళ్యాణ్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసినారు.



## వినియోగదారులకు అంతరాయం లేని విద్యుత్ సరఫరా అందించాలి

ఆసిఫాబాద్, డిసెంబర్ 19, ప్రభాతవార్త:



జిల్లాలో వినియోగదారులకు అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించాలని ఎన్.పి.డి.సి.ఎల్. సంచాలకులు (ఆపరేషన్) టి. మధుసూదన్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో సిఈ అశోక్ కుమార్, ఆసిఫాబాద్ ఎస్ఈ ఉత్తం జాడేలతో కలిసి జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్.పి.డి.సి.ఎల్. సంచాలకులు (ఆపరేషన్) మాట్లాడుతూ విద్యుత్ లైన్ల నిర్వహణ సమర్థవంతంగా చేపట్టి వినియోగదారులకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని, పెండింగ్ లో ఉన్న రైతుల వ్యవసాయ పంపుసెట్లకు త్వరితగతిన విద్యుత్ సౌకర్యం కల్పించాలని తెలిపారు. చెడిపోయిన ట్రాన్స్ఫార్మర్లను శాఖ వాహనంలో మాత్రమే తరలించాలని, నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని తెలిపారు. వచ్చే వేసవిలో విద్యుత్ వినియోగాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రణాళిక సిద్ధం చేయాలని, అంతరాయం లేకుండా విద్యుత్ అందించేందుకు అధిక లోడ్ ఉన్న ట్రాన్స్ఫార్మర్ల చోట అదనపు ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. జిల్లాలో పెండింగ్ లో ఉన్న 33 కెవి 6 లింక్ లైన్ల పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఏఓ దేవిదాస్, కాగజ్ నగర్, ఆసిఫాబాద్ డిఈఈ లు నాగరాజు, వీరేశ, ఎడిఈ లు శ్రీనివాస్, ఇర్ఫాన్ అహ్మద్, రాజేశ్వర్, శ్రీనివాస్, ఏఈలు, ఎఓలు, సబ్ ఇంజనీర్లు పాల్గొన్నారు.



## బిజెపికి జై కొట్టిన పల్లెలు

### - బిజెపి జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్

బజార్‌హత్నూర్, డిసెంబర్ 19, ప్రభాతవార్త:

మండల కేంద్రంలోని ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో బిజెపి పార్టీ మద్దతు దారులకు పల్లె ప్రజలు జై కొట్టారని బిజెపి జిల్లా అధ్యక్షులు పతంగే బ్రహ్మానంద్ అన్నారు. శుక్రవారం బజార్‌హత్నూర్ మండల కేంద్రంలో నూతన సర్పంచ్‌లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పతంగే బ్రహ్మానంద్ మాట్లాడుతూ ఎంపి గోడం నగేష్ సొంత మండలంలో బిజెపి 13 సర్పంచ్ స్థానాలను గెలుచుకుని మండలంలో అత్యధిక సర్పంచ్‌లు గల పార్టీగా బిజెపి అవతరించిందని అన్నారు. గ్రామాల అభివృద్ధికి నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులు, ఇతర సహకారాలు, పథకాల పట్ల ప్రజలు అవగాహన పెంచుకున్నారని, బిజెపి పట్టణాలకు మాత్రమే పరిమితం అనుకుంటున్న వారికి ఇదొక చెంప పెట్టని అన్నారు. గ్రామ గ్రామాన గడప గడపకు బిజెపి విస్తరించిందని, రాబోయే ప్రతి ఎన్నికలో బిజెపి విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అంతకు ముందు నూతన సర్పంచ్‌లకు శాలువాలతో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నూతన సర్పంచ్‌లు మెస్రం మాధవ్ (జాతర్ల), అర్క యాదవ్ రావు (ధరంపురి), పెందూర్ సంగీత (అందుగూడ), మడావి సింధు (భూతాయి కే), గారులే పూజ (భూతాయి బి), కుద్మెత విజయ (డేడ్ర), సూర్యవంశీ నిషాతాయి (కిన్నేర్ పల్లి) , గోటుముకులే సుభాష్ (బోస్ర ), సావిత్రి బాయి (హర్కాయి), సిద్దా హిరాబాయి (అనంతపూర్), పెందూర్ గంగామణి (రాంపూర్), అరవింద్ (గిరిజాయి), కొడప పద్మ (చింతల్ సాంగ్వి)లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు పోరెడ్డి శ్రీనివాస్, పిఏసిఎస్ చైర్మన్ మేకల వెంకన్న యాదవ్, నాయకులు కొత్త శంకర్, రమణ, బొడ్డు భోజన్న, అల్కే గణేష్, గాజుల రాకేష్, కేవల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



నర్వ సర్పంచ్ ఆగిడి స్రవంతి లింగన్నలను శాలువాతో సత్కరిస్తున్న మంత్రి వివేక్

## సర్పంచ్, ఉప సర్పంచ్‌లకు ఘన సన్మానం

**జైపూర్, డిసెంబర్ 19, ప్రభాత వార్త**

చెన్నూరు నియోజకవర్గంలో ఇటీవలే జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపొందిన సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డ్ సభ్యులతో క్యాంపు కార్యలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించి, ఘనంగా సన్మానించారు. ఈ సందర్బంగా వివేక్ మాట్లాడుతూ గెలిచినా పాలక వర్గం పై గురుతర బాధ్యత ఉందన్నారు. గ్రామాల్లో మోళిక వసతుల కల్పనా, గ్రామ అభివృద్ధికి దోహదం చేయాలని కోరారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**వేమనపల్లి, డిసెంబర్ 19, ప్రభాతవార్త**

విద్యుత్ మరమ్మతుల కారణంగా లక్ష్మీపూర్ సబ్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకు శనివారం ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వేమనపల్లి మండల విద్యుత్ శాఖ ఏఈ దీక్షిత్ ఒ ప్రకటనలో తెలిపారు. బద్దెంపల్లి, నాగరం, జిల్లెడ, లక్ష్మీపూర్, జక్కపల్లి, చామనపల్లి, సూరారం, బుయ్యారం, బొమ్మెన, మామిడిపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అందుకు విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

## నస్పూర్ ఆటో యూనియన్ సభ్యుల నిజాయితీ

**- చోరీకి గురైన ఆటో లభ్యం**

**- పోలీసుల సహకారంతో డ్రైవర్‌కు అప్పగింత**

**నస్పూర్, డిసెంబర్ 19, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా కేంద్రం ఏసీసీకి చెందిన ఆటో డ్రైవర్ రవికి చెందిన ఆటో ఇటీవల చోరీకి గురైంది. జీవనాధారమైన ఆటో కనిపించకపోవడంతో ఆ నిరుపేద కుటుంబం తీవ్ర ఆవేదనకు లోనైంది. అయితే, ఫ్లడ్ కాలనీలోని ఒక లారీ యార్డ్‌లో గుర్తుతెలియని వ్యక్తులు ఒక ఆటోను వదిలి వెళ్లినట్లు స్థానిక యువకులు గుర్తించారు. వారు వెంటనే నస్పూర్ యూనియన్ సభ్యులైన అగ్గు సంపత్, సాగర్‌లకు సమాచారం అందించారు. యూనియన్ సభ్యులు వెంటనే స్పందించి, పోలీసుల సహకారంతో అక్కడికి చేరుకున్నారు. అది రవికి చెందిన ఆటోగానే గుర్తించి, అతనికి సమాచారం అందించారు. తన కుటుంబానికి ఆధారమైన ఆటో తిరిగి దొరకడంతో డ్రైవర్ రవి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. సమయానికి స్పందించి ఆటోను గుర్తించడంలో తోడ్పడిన నస్పూర్ ఆటో రిక్షా వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులకు, పోలీసు అధికారులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

### నిజాయితీకి మారుపేరుగా నస్పూర్ ఆటో యూనియన్..

నస్పూర్ ఆటో యూనియన్ సభ్యులు గతంలోనూ తమ నిజాయితీని చాటుకున్నారు. ఇటీవల ఒక పురోహితుడు ఆటోలో మర్చిపోయిన సెల్ ఫోన్‌ను, అంతకుముందు ఒక మహిళకు చెందిన ఫోన్‌ను వారికి తిరిగి అప్పగించి ఆదర్శంగా నిలిచారు. ఆటో డ్రైవర్ల వరుస సేవా కార్యక్రమాలు, నిజాయితీపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో నస్పూర్ షిర్కే కాలనీ ఆటో యూనియన్ అధ్యక్షులు మాలేం జగదీష్, కోశాధికారి ఆకుల సూరి, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.



ఆటోను గుర్తించడంలో సహకరించిన వ్యక్తిని సన్మానిస్తున్న దృశ్యం

# కాంగ్రెస్ పార్టీ ప్రజలను భయపెట్టి ఓట్లు వేయించుకుంది

**★ గడ్డం వినోద్ స్థానికంగా ఉంటానని చెప్పి విస్మరించారు ★ నియోజకవర్గంలో మండలానికో సామంత ఎమ్మెల్యేను పెట్టుకున్నారు : బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య**

**బెల్లంపల్లి, డిసెంబర్ 19, ప్రభాతవార్త**

అసెంబ్లీ ఎన్నికల్లో తనని గెలిపిస్తే బెల్లంపల్లిలో స్థానికంగా ఇల్లు నిర్మించుకుని ఇక్కడే ఉంటానని ప్రజలకు బాండ్ పేపర్ రాసిచ్చిన ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఈ విషయాన్ని విస్మరించారని బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో గెలుపొందిన బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ లకు శుక్రవారం బెల్లంపల్లి బీ ఆర్ ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నియోజకవర్గంలో నెలకొన్న ప్రధాన సమస్యలను పట్టించుకోకుండా ఎమ్మెల్యే వినోద్ మండలానికొక సామంత ఎమ్మెల్యే ని పెట్టుకుని పోలీసులను తమ గుప్పిట్లో పెట్టుకుని బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలపై నాయకులపై తప్పుడు కేసులు పెట్టిస్తూ, బెదిరిస్తూ పలు ఇబ్బందులకు గురి చేస్తున్నారని దుర్గం చిన్నయ్య ఆరోపించారు. ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు గుండాయిజం చేస్తూ ప్రజలను భయపెట్టి మభ్యపెట్టి ఓట్లు వేయించుకున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు పరచకుండా, ఇందిరమ్మ ఇళ్ల పేరుతో ప్రజలను మభ్యపెట్టి ప్రలోభాలకు గురి చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకత సర్పంచ్ ఎన్నికల్లో రుజువైందని అందుకే బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో, రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులను ప్రజలు ఓడించారని అన్నారు. బెల్లంపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చేస్తున్న దందాలకు విసుగు చెందిన ప్రజలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థుల్లో 26 సర్పంచ్ స్థానలను గెలిపించడం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ పతనానికి నాంది పలుకుతుందన్నారు. ప్రజలు బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉండాలని కోరుకుంటున్న సందర్భాలు వచ్చాయని దుర్గం చిన్నయ్య పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు చేస్తున్న గుండాయిజానికి, రౌడీయిజానికి, బెదిరింపులకు భయపడవద్దని రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు పట్టం కడతారని ఆయన జోష్యం చెప్పారు. సర్పంచ్ ఎన్నికల్లో నియోజకవర్గ వ్యాప్తంగా మద్యం, డబ్బులు ప్రలోభ పెట్టి పోలీసులతో అక్రమ కేసులు బనాయించడం, ఇందిరమ్మ ఇల్లు రావాలంటే కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని బహిరంగంగా కాంగ్రెస్ నాయకులు బెదిరిస్తూ ప్రచారం చేశారని ఆయన గుర్తు చేశారు. రానున్న ఎంపీటీసీ, జెడ్పిటీసీ ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్ పార్టీని గెలిపిస్తే రావాల్సిన హక్కులు, అమలు కావలసిన సంక్షేమ పథకాలపై ప్రభుత్వంపై పోరాడి ప్రజలకు ఇప్పిస్తామని అన్నారు. మహిళలకు రూపాయలు 2500 పెన్షన్ వృద్ధులకు రూపాయలు నాలుగు వేల పెన్షన్ ఇస్తామని గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని విస్మరించి ప్రజలకు కల్లబొల్లి మాటలు చెబుతూ పాలన సాగిస్తున్నారన్నారు. ప్రజా సమస్యలపై బిఆర్ఎస్ పార్టీ చేపట్టే పోరాటాలకు బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు నాయకులు సంసిద్ధం కావాలని అందుకు ప్రజలను సన్నద్ధం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం దుర్గం చిన్నయ్య బెల్లంపల్లి నెన్నల, వేమనపల్లి, కాసిపేట, తాండూర్, కన్నెపల్లి, భీమిని తదితర మండలాల్లో సర్పంచులుగా గెలిచిన బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు సాగర్ గౌడ్, ఇబ్రహీం లతో పాటు నెన్నల, భీముని, కన్నెపల్లి, వేమనపల్లి, కాసిపేట తాండూర్, బెల్లంపల్లి మండలాలకు చెందిన బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న ముక్త వేణుగోపాల్

## ఓం అష్టోత్తర యోగా పీట్ అధ్యక్షుడి రక్తదానం

**మంచిర్యాల, డిసెంబర్19, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా కేంద్రనికి చెందిన ఓం అష్టోత్తర యోగా పీట్ అధ్యక్షులు,మల్యాల రాజయ్య యూత్ వెల్ఫేర్ సొసైటీ సభ్యుడు, ముక్త వేణుగోపాల్ రక్తదానంతో ప్రాణాలు కాపాడిన మహానుభావుడు, పట్టణములో ప్రముఖ వైద్యశాల మరోసారి రక్తదానం చేసి అందరి మనసులు గెలుచుకున్నాడు. ఇది అతనికి చాలాసార్లు రక్తదానం చేయడం విశేషం. అత్యవసర సమయాల్లో రక్తం కోసం ఎదురుచూస్తున్న రోగుల ప్రాణాలను కాపాడేందుకు ముక్త వేణుగోపాల్ ఎప్పటికప్పుడు సిద్ధంగా ఉంటాడు. రక్తదానమే కాకుండా, అతను అనేక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటాడు. పేద విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేయడం, వృద్ధాశ్రమాల్లో సేవ చేయడం అతని రొటీన్, మరొక పక్క యోగా శిక్షకుడిగా, యోగా పీట్ అధ్యక్షుడిగా నిత్యం యోగా చేస్తూ, చెపిస్తూ, పట్టణ ప్రజలకు యువతకు, క్రీడాకారులకు అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడు. అంతే కాకుండాపర్యావరణ పరిరక్షణలో భాగంగా వందలాది మొక్కలు నాటి, స్వచ్ఛ భారత్ కార్యక్రమాల్లో క్రియాశీలకంగా ఉంటాడని, అతని సేవా దృక్పథం చూసి చాలామంది యువత రక్తదానం, సేవా కార్యక్రమాల్లో చేరుతున్నారు. వేణుగోపాల్ లాంటి వ్యక్తులు సమాజానికి ఆదర్శంగా నిలుస్తారని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదని, అతని సేవలు కొనసాగించాలని అందరూ ఆకాంక్షిస్తున్నారు. రక్తదాన కార్యక్రమంలో ముక్త వేణుగోపాల్, మల్యాల శ్రీపతి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరాంపూర్ ఏరియాకు వర్క్ షాప్ గుండెకాయ వంటిది

**- ఘనంగా 56వ వార్షిక రక్షణ పక్షోత్సవాల ప్రారంభం**

**నస్పూర్, డిసెంబర్ 19, ప్రభాతవార్త**

శ్రీరాంపూర్ ఏరియా వర్క్ షాప్ లో 56వ వార్షిక రక్షణ పక్షోత్సవాలను శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్, వార్షిక రక్షణ పక్షోత్సవాల ఇన్స్పెక్షన్ కమిటీ కన్వీనర్ ఎన్. దామోదర్ రావు, బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం రఘుకుమార్ ముఖ్య అతిథులుగా హాజరై రక్షణ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శ్రీరాంపూర్ ఏరియాలోని వివిధ గనులకు వర్క్ షాప్ గుండెకాయ వంటిదని కొనియాడారు. గనులకు అవసరమైన యంత్రాలను సకాలంలో మరమ్మత్తు చేసి అందించడం ద్వారా రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించడంలో వర్క్ షాప్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ప్రతి ఉద్యోగి విధి నిర్వహణలో వ్యక్తిగత రక్షణ పరికరాలను తప్పనిసరిగా ధరించాలని, సేఫ్ శ్రీరాంపూర్-సేఫ్ సింగరేణిగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా మహిళా ఉద్యోగినులు నిర్వహించిన సీపీఆర్ ప్రదర్శన అందరినీ ఆకట్టుకోగా, కమ్యూనికేషన్ సెల్ కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఎస్వోటు జీఎం ఎన్. సత్యనారాయణ, గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, ఏరియా ఇంజనీర్ రమణ రావు, డీజీఎం రవీందర్, రక్షణాధికారి విజయ్ కుమార్, డాక్టర్ రమేష్ బాబు, పిట్ కార్యదర్శి సదానందం, ఇన్స్పెక్షన్ కమిటీ సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



# జిల్లా విద్యాధికారికి వినతిపత్రం అందజేత

మంచిర్యాల, డిసెంబర్ 19, ప్రభాతవార్త

శుక్రవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని జిల్లా విద్యాధికారికి తల సేమియా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం సభ్యులు కాసర్ల శ్రీనివాస్ మాట్లాడుతూ తల సేమియా సికిల్ సెల్ వ్యాధిగ్రస్తుల పిల్లలకు 6 సంవత్సరాల వయసు నుండి 18 సంవత్సరాల వయసు వరకు కేంద్ర రాష్ట్ర కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల, ప్రైవేటు పాఠశాలల్లో ప్రైవేటు ఇంటర్ కాలేజీల వరకు వీరికి ఉచిత విద్యను అందించాలని,డిసేబులిటీ బిల్ ఆర్ పి డబ్ల్యూ డి 2016 ప్రకారంగా 21 రకాల వ్యాధులను వికలాంగులుగా గుర్తించినది గనకా,ఈ 21 రకాల వ్యాధుల కలవారికి కూడా ఉచిత విద్యను అందించాలని,21 రకాల లో అందులో భాగంగా రక్తక్షీణిత జబ్బులు అయినటువంటి తలసేమియా సికిల్ సెల్ హిమోఫిలియా వారు కూడా వికలాంగుల జాబితాలో ఉన్నారు. కాబట్టి వీరికి 6 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాల వరకు ఉచిత విద్యను అందించాలని ఈరోజు మంచిర్యాల జిల్లా డిఈఓ ఆఫీస్ అడిషనల్ డైరెక్టర్ ఎల్ లలితకి వినతి పత్రం అందజేశారు. డిజేబులిటీ బిల్లు 2016 నుంచి ఈ జీవోలు అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారులపై పాలన అధికారులపై ఉన్నది కానీ అధికారులు చట్టం చేసి దాన్ని అమల్లోకి తీసుకురాకపోవడం జరుగుతుందని, ఇప్పటివరకు 9 సంవత్సరాలు అవుతుంది జీవో విడుదలై కానీ నేటికీ విద్య అవకాశాలలో 5 రిజర్వేషన్ చేయకపోవడం కారణంగా మేము ఆందోళన వ్యక్తం చేస్తున్నామని,. మా తలసేమియా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో తలసేమియా సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులకు ఉచిత విద్యను అందించాలని,ఈ జీవోను అమలు కానీ ఎడల వివిధ రకాల ఆందోళన కార్యక్రమాలు తలసిన వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ధర్నాలు, రాస్తారోకోలు, రిలే నిరాహార దీక్షలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని, ఈ జీవో అమలు చేసే అంతవరకు కూడా మేము పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో తలసేమియా వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసర్ల శ్రీనివాస్, చుంచు శంకర్ వర్మ, బండ అవినాష్, పేషెంట్ల తల్లితండ్రులు జీవన్, జబీర్ ఖాన్, స్వాతి, శారద, ఇట్యాల ఇములు, లాస్య పాల్గొన్నారు.



విద్యాధికారికి వినతి పత్రంఇస్తున్న తల సేమియా వెల్ఫేర్ సొసైటీ సభ్యులు

# సింగరేణిపై సర్కారు కుట్ర

**- మణుగూరు బొగ్గు బ్లాక్‌ను సింగరేణికే కేటాయించాలి**

**- బిఎంఎస్ శ్రీరాంపూర్ ఉపాధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి**

నస్పూర్, డిసెంబర్ 19, ప్రభాతవార్త



సింగరేణి సంస్థను నిర్వీర్యం చేసేలా రాష్ట్ర ప్రభుత్వం కుట్రపూరిత నిర్ణయాలు తీసుకుంటోందని సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ (బిఎంఎస్) శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్ రెడ్డి విమర్శించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మణుగూరు పీకే ఓసీ-2 ఎక్స్టెన్షన్ బ్లాక్‌ను సింగరేణిని పక్కన పెట్టి, జెన్ కో ద్వారా ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టే ప్రయత్నం చేయడం సంస్థ మనుగడపై దాడి అని ఆయన మండిపడ్డారు. గతంలో తాడిచెర్ల బ్లాక్ విషయంలో జరిగిన నష్టాన్ని ప్రభుత్వం విస్మరించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపముఖ్యమంత్రి పాత ప్రకటనలకు విరుద్ధంగా వ్యవహరించడం ప్రభుత్వ ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు. ఏఐటియుసి, ఐఎన్‌టియుసి సంఘాలు అధికార పార్టీలకు కొమ్ముకాస్తూ కార్మికులను మోసం చేస్తున్నాయని ఆరోపించారు. మణుగూరు బ్లాక్‌ను వెంటనే సింగరేణికే కేటాయించాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.





## భూమేష్ చేసిన అభివృద్ధికి నిలువెత్తు సాక్ష్యమే సర్పంచ్‌గా సుష్మ భూమేష్ ఘన విజయం

**- రాష్ట్ర ఆర్య వైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు నలుమాసు కాంతయ్య**

జన్నారం, డిసెంబర్ 19, ప్రభాతవార్త

గత ఐదు సంవత్సరాల పదవీ కాలంలో భూమేష్ చేసిన అభివృద్ధికి నిలువెత్తు సాక్ష్యమే తన భార్య సుష్మ భూమేష్ పొనకల్ సర్పంచ్‌గా ఘన విజయం సాధించడమే అని రాష్ట్ర ఆర్య వైశ్య మహాసభ ఉపాధ్యక్షులు నలుమాసు కాంతయ్య అన్నారు. శుక్రవారం నాడు జన్నారం మండల కేంద్రంలోని భూమేష్ స్వగృహంలో మంచిర్యాల జిల్లా ఆర్యవైశ్య మహాసభ కమిటి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అభినందన సన్మాన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని అయన మాట్లాడారు. గత ఐదు సంవత్సరాలు జక్కు భూమేష్ చేసిన అభివృద్ధిని మరిచిపోకుండా ప్రజలు తమ గుండెల్లో పెట్టుకుని ఈసారి అతని భార్య జక్కు సుష్మను అత్యంత భారీ మెజారిటీతో ప్రజలు గెలిపించుకోవడం చాలా గొప్ప విషయమని, అలాగే జక్కు సుష్మ భూమేష్ కూడా ఈ సారి గతం కంటే మరింత అభివృద్ధి చేసి ప్రజలు తనకు ఇచ్చిన గెలుపు గిఫ్ట్ కు బదులుగా అభివృద్ధిని ప్రజలకు రిటర్న్ గిఫ్టుగా అందించాలని కోరారు. అనంతరం సర్పంచ్‌గా గెలుపొందిన జక్కు సుష్మ భూమేష్ దంపతులను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా ఆర్యవైశ్య సంఘం మహాసభ కమిటి అధ్యక్షులు కొత్త వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి చిలువేరు వైకుంఠం, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ముక్త శ్రీనివాస్,మంచిర్యాల జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చెట్ల రమేష్, జన్నారం సంఘం పెద్దలు జక్కు సత్తయ్య, జన్నారం మండల వర్తక సంఘం అధ్యక్షుడు వొజ్జల వామన్, గోలి చందు,భాషెట్టి మణి, జక్కు శ్రీనివాస్, వాసు మెడికల్, శీలం శేఖర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## మందమర్రి ఏరియాలో వెల్ బేబీ షో

**- సింగరేణి ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా నిర్వహణ**

మందమర్రి, డిసెంబర్ 19, ప్రభాతవార్త

సింగరేణి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం నాడు మందమర్రిలోని కేకే-డిస్పెన్సరీలో ఏరియా స్థాయి వెల్ బేబీ షో నిర్వహించనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో మందమర్రి ఏరియాకు చెందిన సింగరేణి కార్మికుల 0 నుంచి 5 సంవత్సరాల లోపు పిల్లలు పాల్గొనేందుకు అర్హులు. పాల్గొనదలచిన వారు అదే రోజు ఉదయం 10 గంటలలోపు కేకే-డిస్పెన్సరీలో తమ పిల్లల పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. నమోదు సమయంలో వయస్సు ధ్రువీకరణ పత్రం, వాక్సిన్ కార్డు తప్పనిసరిగా చూపించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమం డిసెంబర్ 20వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని మందమర్రి ఏరియా డీజీఎం (పర్సనల్) అశోక్ తెలిపారు.

## తెలంగాణ మెడికల్ అండ్ సేల్స్ రిప్రెజెంటివ్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా

మంచిర్యాల, డిసెంబర్ 19, ప్రభాతవార్త

తెలంగాణ మెడికల్ అండ్ సేల్స్ రిప్రెజెంటేటివ్స్ యూనియన్ మంచిర్యాల శాఖ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయిస్ యాక్ట్ (ఎస్‌పిఈ యాక్ట్ 1976)ని పునరుద్దరించాలని శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు మెడికల్ అండ్ సేల్స్ రిప్రెజెంటేటివ్స్ ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. 4 కొత్త కార్మిక చట్టాల వలన దేశంలో ఉన్న కార్మిక వర్గానికి మరియు మెడికల్ అండ్ సేల్స్ రిప్రెజెంటేటివ్స్ తీవ్ర అన్యాయం జరుగుతుందని, మరియు యూనియన్ ఏర్పాటు చేసుకొనే హక్కుని, న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేసే హక్కును కూడా కాలరాసేలా ఈ చట్టాలు ఉన్నాయని అలాగే మెడికల్ అండ్ సేల్స్ రిప్రెజెంటేటివ్స్ కోసమే ప్రత్యేకంగా ఏర్పాటు చేయబడిన సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయిస్ (ఎస్‌పిఈ ) యాక్ట్ 1976 కూడా రద్దు చేయడంతో దేశ వ్యాప్తంగా పని చేస్తున్న మెడికల్ రిప్రెజెంటేటివ్స్‌కి ఫారం ఏ లో అప్పాయింట్మెంట్ లెటర్ రాకపోవడం, కనీస వేతన చట్టం, బోనస్ చట్టం, గ్రాట్యుటీ చట్టం, ఇలాంటి ఎన్నో చట్టాలు అమలు ప్రశ్నార్థకంగా మారుతుందని తెలిపారు. కావున రాష్ట్ర ప్రభుత్వం ఈ సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయిస్ యాక్ట్ (ఎస్‌పిఈ యాక్ట్ 1976) ని యాదవిధిగా అమలు పరిచేలా కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకురావాలని, అలాగే ఈ చట్టాలు తయారు చేసే సమయంలో యూనియన్ గా తామిచ్చిన సలహాలు, సూచనలు పొందుపరచాలని, అలాగే ఒకవేళ రాష్ట్ర ప్రభుత్వం ఈ కొత్త చట్టాలకు అనుగుణంగా రూల్స్ రూపొందిస్తే సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయిస్ (ఎస్‌పిఈ) యాక్ట్ 1976 చట్టం ఆధారంగా తాము గత ప్రభుత్వానికి ఇచ్చిన సలహాలు, సూచనలు పరిగణలోకి తీసుకొని వాటిని యధావిధిగా పొందు పరచాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వర్యులు గడ్డం వివేక్ వెంకట స్వామి, జిల్లా అడిటినల్ కలెక్టర్ ద్వారా వినతిపత్రం సమర్పించడం జరుగుతుందని అన్నారు. అలాగే నిన్న అనగా డిసెంబర్ 18న కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయిస్ (ఎస్‌పిఈ) యాక్ట్ 1976 చట్టాన్ని పునరుద్దరించాలని, మెడికల్ అండ్ సేల్స్ రిప్రెజెంటేటివ్స్‌కి చట్ట భద్దమైన పని విధానాలను రూపొందిచాలని తెలంగాణ మెడికల్ అండ్ సేల్స్ రిప్రెజెంటేటివ్స్ యూనియన్ ఆధ్వర్యంలో వేలాది మందితో హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద ధర్నా నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్య వర్గ సభ్యులు సాగర్ రెడ్డి, మంచిర్యాల శాఖ అధ్యక్ష కార్యదర్శులు పి.కుమార్, వి.సంతోష్, ఉపాధ్యక్షుడు రామకృష్ణ, కోశాధికారి బి.వెంకటేష్, శాఖ సభ్యులు, మిగతా సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




## మాతా శిశు మరణాలు తగ్గించడమే అమ్మ ఒడి వాహనం ముఖ్య ఉద్దేశం

జన్నారం, డిసెంబర్ 19, ప్రభాతవార్త

మాతా శిశు మరణాలు తగ్గించడమే అమ్మ ఒడి(102) వాహనం ముఖ్య ఉద్దేశం అని పి.ఎం స్మామ్రాట్, ఈఎంఇ కొండాల్ రావు అన్నారు. ఈ సంధర్బంగా వారు మాట్లాడుతు మంచిర్యాల జిల్లాలో పది అమ్మ ఒడి (102) వాహనాలు సేవలు అందిస్తున్నాయి అని అన్నారు. ఒక స్త్రీ గర్భిణి అయినప్పటి నుండి మరియు ప్రసవానంతరం వరకు ఇంటి నుండి ఆసుపత్రికి వైద్య పరీక్షల అనంతరం మళ్ళీ సురక్షితంగా ఇంటి వద్ద వదిలిపెడుతుందని అన్నారు. జన్నారం మండలంలో గత నాలుగు నెలల నుండి 1915 మంది గర్భిణీలకు సేవలు అందించామని 102 కెప్టెన్ కొట్టే రవి కుమార్ తెలిపారు. ఆగస్టు నెలలో 374 గర్భిణీలు, సెప్టెంబర్ నెలలో 424 గర్భిణీలు, అక్టోబర్ నెలలో 510 గర్భిణీలు, నవంబర్ నెలలో 617 గర్భిణీలకు సేవలు అందించామని తెలిపారు. అలాగే పుట్టిన బిడ్డకు వివిధ నెలలలో ఇచ్చే టీకాలు కోసం ఆస్పత్రికి తీసుకెళ్లడం ద్వారా మారుమూల ప్రాంతాల్లో నివసించే గర్భిణీలకు ఎంతో ఆసరాగా ఉపయోగపడుతుందని జిల్లా పి. ఎం స్మామ్రాట్, జిల్లా కో ఆర్డినేటర్ కొండాల్ రావు అన్నారు. ఈ సంధర్బంగా 102 కెప్టెన్ చేసిన సేవలకు గాను కొట్టె రవి కుమార్‌ను అభినందించారు.

# బోథ్‌లో మారుతున్న రాజకీయ సమీకరణాలు

**- బీఆర్ఎస్‌లో చేరిన బిజెపి, కాంగ్రెస్ నాయకులు**

ఆదిలాబాద్, డిసెంబర్ 19, ప్రభాతవార్త:

ఇటివలె నిర్వహించిన పంచాయతి ఎన్నికల్లో బీఆర్ఎస్ అత్యధిక స్థానలు గెలవడంతో బోథ్‌లో రాజకీయ సమీకరణాలు మారుతున్నాయి. శుక్రవారం నెరడిగొండ మండలం లింగట్ల ఉపసర్పంచ్, కాంగ్రెస్ నాయకులు పవార్ విజయ్, కొరటికల్ గ్రామ కాంగ్రెస్ నాయకులు సాబ్లే రంజిత్, బీజేపీ నాయకులు, లింగట్ల వార్డు సభ్యుడు సంతోష్ బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న ఎంపిటీసీ, జడ్పీటీసీ స్థానాల్లో కాంగ్రెస్, బీజేపీకి డిపాజిట్లు గల్లంతు చేస్తామని అన్నారు. అభివృద్ధి చేసే పార్టీలో ఉంటే అభివృద్ధిలో భాగమవుతారని, గ్రామ సమస్యలపై పోరాడాలని గ్రామానికి ఏ అవసరం ఉన్న ఒక అన్నలా నెరడిగొండలో మీకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో పిఏసీఎస్ చైర్మన్ కిషోర్, మాజీ సర్పంచ్ శ్రీను, దొతి గులాబ్, మెర్బాన్ పాల్గొన్నారు.

## మనోవేదనతో మహిళ ఆత్మహత్య

**సారంగాపూర్, డిసెంబర్ 19, ప్రభాతవార్త:**



మనోవేదనతో మహిళా ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం ధని గ్రామానికి చెందిన అడ్డిగ రాజమణి(36) అత్త ఊరు నిర్మల్ మండలం చిట్యాల గ్రామం. కొన్ని సంవత్సరాల క్రితం భర్త చనిపోగా కొడుకు రిషి(14) సంవత్సరం క్రితం చనిపోయాడు. అప్పటి నుండి మానసికంగా కుంగిపోయి బాధపడుతుంది. సంవత్సరం నుండి సారంగాపూర్ మండలం ధని గ్రామంలో తల్లి వద్దనే ఉంటుంది. గత నెల ఆత్మహత్య చేసుకోడానికి ప్రయత్నించగా అన్నదమ్ములు కాపాడారు. గురువారం రాత్రి నుండి ఆమె ఇంట్లో కనిపించక పోవడంతో కుటుంబ సభ్యులు వెతకగా ధని గ్రామం ఎస్సీ కాలనీ వెనుకాల గల గ్రామపంచాయతీకి సంబందించిన బావిలో చనిపోయి ఉంది. మృతురాలి అన్న బిక్కు పెద్ద రాజేశ్వర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, నిర్మల్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టమ్ నిర్వహించడం జరిగిందని ఎస్సై తెలిపారు.



పనులను పరిశీలిస్తున్న సర్పంచ్, ఉప సర్పంచ్ మాయ హరి నాయక్ జాదవ్

## భగీరథ నీటిపైప్‌లైన్‌కు మరమ్మతులు

**ఉట్నూర్, డిసెంబర్ 19, ప్రభాతవార్త :**

మండలంలోని లింగోజితండా ఎక్స్ రోడ్డు గ్రామంలో సరఫరా అవుతున్న భగీరథ నీళ్ల పైప్‌లైన్‌కు సర్పంచ్, ఉప సర్పంచ్ మాయ హరి నాయక్ జాదవ్ మరమ్మత్తులు చేయించారు. మిషన్ భగీరథ అధికారులతో ఫోన్లో మాట్లాడరు. వెంటనే అధికారులు స్పందించి వారి సిబ్బందిని పంపించి మర్మతులు చేశారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**తాండూర్, డిసెంబర్ 19, ప్రభాతవార్త :**

మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ లో మరమత్తుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ మండల ఏఈ జాన్ తెలిపారు. బోయపల్లి, చౌటపల్లి, తాండూర్, ఐబీ, రాజీవ్ నగర్, కొత్తపల్లి, రేపల్లెవాడ, మాదారం, మాదారం 3 ఇంక్లైన్, కాసిపేట, చంద్రపల్లి, ద్వారకాపూర్, అబ్బాపూర్, బెజ్జాల, నర్సాపూర్ గ్రామాల్లో ఉదయం 9 గంటల నుండి 11 గంటల వరకు కరెంటు ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

## రోడ్డు నిబంధనలు
## ప్రతి ఒక్కరూ పాటించాలి

**ఆసిఫాబాద్, డిసెంబర్ 19, ప్రభాతవార్త:**

రోడ్డు నిబంధనలను ప్రతీ ఒక్కరు పాటించాలని ఆసిఫాబాద్ ఎస్హెచ్ఓ బాలాజీ వరప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఆసిఫాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు భద్రతను పెంపొందించే ఉద్దేశంతో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారని ఈ సందర్భంగా ట్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్ వినియోగిస్తూ వాహనాలు నడపడం, అజాగ్రతగా, అతివేగంతో నిరక్ష్యంగా వాహనాలు నడిపిన వారిని గుర్తించి పట్టుకున్నట్లు తెలిపారు. వారిపై మొత్తం 5 కేసులు నమోదు చేసినట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ తెలిపారు.




ఎస్హెచ్ఓ బాలాజీ వరప్రసాద్

### షెడ్యూల్ కులాల విద్యార్థులకు ఉపకార వేతనం కొరకు

# రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలి

**- జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే**

**ఆసిఫాబాద్, డిసెంబర్ 19, ప్రభాతవార్త:**

జిల్లాలోని షెడ్యూల్డ్ కులాల విద్యార్థులకు ఉపకార వేతనం కొరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్, జిల్లా ఇంచార్జ్ విద్యాధికారి దీపక్ తివారి, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావులతో కలిసి మండల విద్యాధికారులు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులతో స్కాలర్షిప్ పోర్టల్ లో విద్యార్థుల వివరాల నమోదుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 2674 మంది షెడ్యూల్డ్ కులాలకు చెందిన విద్యార్థులకు ప్రభుత్వం ఉపకార వేతనం అందిస్తుందని, వారి వివరాలను ఈనెల 23వ తేదీలోగా స్కాలర్షిప్ పోర్టల్ లో నమోదు చేయాలని తెలిపారు. బాలికలకు రూ. 1500, బాలురకురూ. 1000 అందించడం జరుగుతుందని, వసతి గృహాలలో



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

ఉంటూ చదువుకునే విద్యార్థులకు ఈ పథకం వర్తించదని, ఇంటి వద్ద ఉండి పాఠశాలలో చదివే విద్యార్థులకు మాత్రమే వర్తిస్తుందని తెలిపారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కొరకు తహసిల్దార్లతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. 10వ తరగతి వార్షిక పరీక్షల కొరకు విద్యార్థులను ఇప్పటినుండి సన్నద్ధం చేయాలని, ప్రత్యేక తరగతులు నిర్వహించి 100 శాతం విద్యార్థులు హాజరయ్యేలా మండల విద్యాధికారులు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు పర్యవేక్షించాలని తెలిపారు. ఈ సందర్భంగా ఇటీవల జిల్లాలో 3 విడతలుగా జరిగిన 2వ సాధారణ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాల ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడంలో స్టేజ్ 1 ఆర్ఓలు, స్టేజ్ 2 ఆర్ఓలు, పోలింగ్ అధికారులుగా విధులు నిర్వహించిన ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ శాఖ అధికారి అశోక్, మండల విద్యాధికారులు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

**కెరమెరి డిసెంబర్ 19 ప్రభాతవార్త:**



మండలంలోని రిం గంఘాట్ గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందగా మరో యువకుడు తీవ్ర గాయాల పాలయ్యారు. ఎస్సై మధుకర్ తెలిపిన వివరాలు ప్రకారం కథనం కొరారి గ్రామానికి చెందిన మారుస్కోలా మహేష్ (18) మృతిచెందగా మారకోలా జ్యోతిరామ్ అనే యువకుడు తీవ్ర గాయాల పాలయ్యారు. వీరిద్దరూ ద్విచక్ర వాహనంపై ధనోర గ్రామం నుండి ఆసిఫాబాద్ వైపు వెళుతుండగా ముందు వెళ్తున్న ట్రాక్టర్ ను వెనక నుండి అతివేగంగా ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. తీవ్రంగా గాయపడ్డ జ్యోతిరావు ఆసిఫాబాద్ ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. మృతుడు మహేష్ తండ్రి మారుస్కోలా యత్మారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.




తనిఖీ చేస్తున్న మండల వ్యవసాయాధికారి రామకృష్ణ

## ఎరువుల దుకాణాలను తనిఖీ చేసిన మండల వ్యవసాయాధికారి

**కాగజ్‌నగర్, డిసెంబర్ 19, ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్ మండలంలోని పలు ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేయడం చేశారు. ఇందులో భాగంగా ఇక నుంచి యూరియా కోసం రైతులు ఇబ్బంది పడకుండా ఉండటానికి యాప్ ద్వారా యూరియాని బుకింగ్ చేసుకోని అమ్మాలని అన్నారు. ఇక పైన ఎరువుల పంపిణీ సులభతరం కానుంది అని అన్నారు. ఎరువుల వివరాలను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయాలని అన్నారు. యూరియా కోనుగోళ్లలో రైతుల ఇక్కట్లు దూరం చేసేందుకు ప్రభుత్వం షర్టిలైజర్ యాప్‌ను అందుబాటు తెస్తోందని ఈ యాప్ రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. యాప్ ద్వారా యూరియాని ఇంటినుంచే బుకింగ్ చేసుకోవచ్చని తెలిపారు. రైతులకు ఎలాంటి సందేహాలు ఉన్న వ్యవసాయశాఖను సంప్రదించాలని సూచించారు.



## రైతు సంఘం ఆధ్వర్యంలో సర్పంచులకు ఘన సన్మానం

**కెరమెరి డిసెంబర్ 19 ప్రభాతవార్త**

మండల కేంద్రం ఆదివాసీ భవనంలో శుక్రవారం కుమురము భీం సేంద్రీయ ఉత్పత్తి దారుల రైతు సంఘం ఆధ్వర్యంలో మం డలంలోని అన్ని గ్రామ పంచాయతీ సర్పంచులకు పరస్పర సన్మాన కార్యక్రమం నిర్వ హించారు ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు కేంద్రే బాలాజీ మాట్లాడుతూ సేంద్రీయ వ్యవసాయం ద్వారా అధిక పోషక విలువలు కలిగి ఉన్న ఉత్పత్తి చేయొచ్చు అన్నారు ఇది ఆహార పై వైవిధ్యాన్ని పెంచుతుందని సూచించారు సేంద్రియ ఉత్పత్తులు వల్ల హానికరమైన రసాయనాలకు భూమి గురికాకుండా ఉంటుందన్నారు ఉపాధ్యక్షులు నాణేశ్వర్ సెక్రటరీ ఆడ రామచందర్ జనరల్ సెక్రటరీ కుడ్మెత్ గోపాల్ సంఘం సలహాదారుడు అనక దేవరావు మాజీ ఎంపీపీ పెందోర్ మోతిరావు వివిధ గ్రామ రైతులు పాల్గొన్నారు

## దశాబ్దాల నుంచి రోడ్డు లేక అవస్థలు పడుతున్న గిరిజనులు

**- గోస చూడలేక రోడ్డు సాధనకై పాదయాత్ర**

**లింగాపూర్, ప్రభాతవార్త :**



దశాబ్ద కాలాల నుండి రోడ్డు లేక అవస్థలు పడుతున్న గిరిజనుల గోస పట్టించుకునే వారే కరువయ్యారని, ఎన్నికల సమయంలో మా గ్రామాలలో రాజకీ నాయకులు మేము గెలిస్తే రోడ్డు వేస్తామని హామీ ఇచ్చి మరిచిపోతున్నారు. రోడ్డు బాగాలేక అనారోగ్యానపడి ఆసుపత్రికి సమయానికి చేరుకోలేక ప్రాణాలు విడిచిన రోజులు ఉన్నాయి. ప్రభుత్వాలు వస్తున్నాయి పోతున్నాయి. రాజకీయ నాయకులు వస్తున్నారు పోతున్నారు .కానీ పది సంవత్సరాల నుంచి మంజూరు ఉన్న రోడ్డుకు మాత్రమే టెండర్లు పడిన కూడా బిటి రోడ్డు లింగాపూర్ నుండి పంగిడి మదొర వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులు మాత్రం కొనసాగుత లేదు. ఏ రాజకీయ నాయకులూ కూడా దీనిపైన ప్రత్యేక శ్రద్ధ చూపుతలెరని, లింగాపూర్ మండలంలోని పులసింగ్ గ్రామానికి చెందిన జై చంద్ అనే యువకుడు లింగాపూర్ నుండి పంగడి మాధొర వరకు బీటీ రోడ్డు సాధనే లక్ష్యంగా రాష్ట్ర రాజధాని హైదరాబాద్లో పాదయాత్ర చేపట్టి నా వంతు కృషి చేస్తానని ముందుకు సాగుతున్న జై చందు.